ఒకనాడు గ్రంథాలయంలో కూచున్నాం. వీడూ వొచ్చాడు 'నెరజాణ' తీశాడు అందులో వొక వ్యాసం చూపించాడు. అదిచదివాడు దీనిమీదవొక విమర్శన వ్రాస్తానన్నాడు. విమర్శనఅంటె వీడి ఉద్దేశం యేమిటో. విమర్శనకుతగిన లోపాలుండొద్దూ ఆవ్యాసంలో, అట్లా ఏంలేదే, లేకపోతేనేం మనకు తెలిసినవాడు వ్రాశాడట అంచేత వీడు విమర్శిస్తాట్ట మళ్ళీ ఆవిమర్శన direct గా ఉండదట. ఏ "చిలుకపిట్టకథనో" లేక "ఏఅంటిపంటుకథనో" లేకపోతే "విరిగిపోయినదంతం" అనోపేరుపెట్టి వ్రాస్తాట్ట. వీడిలాగే editors కూడ fools అనుకున్నాడుకాబోలుడబ్బారాయుడు. ఇలాటిచొప్పదంటువ్యాసాలు ప్రకటిస్తే అపఖ్యాతని తెలియదు editors కి. ఈ మాట నా friends లో ఒకడు అంటే వాణ్ణి కొట్టడానికొచ్చాడు. పద్మ ఈగందరగోళం చూస్తున్నది. వాడు, నా friend ని, "Fool నా మాటల్లో జోక్యం కలుగజేసుకోకని" కొట్టబోయాడు కాని నా friend వీడ్ని పదువుకు భంగంకలుగజేశాడని వాయించేస్తున్నాడు. మేము ఇహ బాగుండదని విడిపించాం. మనవాడికి ఒళ్ళు నొప్పిపెట్టిందని బాధలేదుకాని పద్మయెదుట అవమానింపబడ్డాను కదాఅను కోపంతో, అక్కరకురానిరోషంతో సైకిలేసుకుపోయాడు. ఇదివిని ఎవరైన mock చేస్తే తన్నడానికి వొచ్చేవాడు. మీరనకండేం,తన్నగలడు. మీరు వాడికన్న బలవంతులుగాని, ఎందుకైనామంచిదిచెప్పేను. కాస్తవింటారుకాదూ ? ఏం? వింటారూ? సరే ఇక goodbye.

# నారదుడు, సూర్య్యుడుకాళీ

వి. ప్రభాకరరావుగారు.

స్వర్గలోకం, నక్షత్రమండలం, అంటెయేమిటో అనుకోకండి. అవికూడ మన భూలోక ఆఫీసులాంటివే. వానిలో యీమధ్య అడపాతడపా కాళీవస్తునే యున్నాయి. కాని అవిమనదాకా రావడంలేదు. వాళ్ళల్లోవాళ్ళే సర్దుకోవడం మొదలుపెట్టారు- ఇప్పుడు ఆపప్పుడకడంలేదు- తప్పకుండా కొంతమందిని మానవలోకంలోంచి తీసుకోమని దేవుడుగారు జి. ఓ పంపించారు. ఇదేసంగతి దినవారపత్రికల్లో ప్రకటించమని వుత్తరవుచేశారు. ప్రస్తుతములోవున్న దినవారపత్రికలు యిది ప్రకటించడంలేదు. ఎందుచేతనంటె అక్కడనాణెములకు యిక్కడవాటికి చాలతేడాకనుపిస్తోంది. పోనీ రెవొలోహంముక్కలేకదాయని ముందు అడ్వాన్సు పంపమంటె ప్రాంశరీనోట్లు వ్రాసి డబ్బు తరువాత యిస్తామన్నారు. దేవుడుగారి ఖజానాలో డబ్బులేనట్టు తోస్తుంది. అదిఅంతా దొంగముండాకొడుకు కుబేరుడు బొక్కసంలోవేసి నిలవచేశాడు. ఇమ్మంటే యియ్యడంలేదు. సీతల్లికడుపుమాడ- ఎండలు జాస్తిగావున్నాయి- కొంపలు తగులడిపోతున్నాయి కొంచెం సాయంచెయ్యరాబాబుఅంటె "అబ్బేడబ్బెక్కడుందండీ మనదగ్గర" అంటాడు. పోనీ పెద్దబాంకీ నాపెట్టు నీదగ్గర అప్పుచ్చుకుంటాంఅంటె మాకు బేంకి ఆనమాయత లేదుబాబు, పెడితే దివాలాతియ్యవలసిందే అంటాడు. అక్కడపరిస్థితులు యిలావున్నాయి, ప్రకటనకి డబ్బులేనిస్థితి పట్టింది దేవుడుగారికి. ఈయన అభిప్రాయం యేమిటంటే ప్రకటనకి డబ్బు అక్కరలేకుండా యేదో వెర్రిమొర్రికథ వ్రాశో లేకపోతే ఎవడినైనా ఒకవిలేఖుని పట్టుకొని వానిచేత పత్రికకు పంపించమన్నట్టు తోస్తుంది. ఇలాంటి దేవుడుగారు జీతాలు రెగ్యులరుగా యిస్తాడ?

అంటారేమొ- భయంలేదు- జీతాలుపుచ్చుకోనేటయిమువస్తే- లక్ష్మి పెళ్లామేకాదండీ.

—: దరఖాస్తుదార్లు గమనించవలసినది :—

55 సంవత్సరములు దాటినవారు ఎవరైనా సరే- స్త్రీపురుషభేదంలేదు. మనిషితత్వం సన్యాసిపిల్లితత్వమై యుండవలెను. దేవుడుగార్కి వెనకతాళంవెయ్యగలిగినవారికి ప్రాముఖ్యత యివ్వబడును. మానాభిమానములు కొంచెముతక్కువగాయుంటె మంచిది ఏమంటారా? ఒకప్పుడు దేవుడుగారికి కాళ్లులాగినా- శరీరము బద్ధకంగావున్నా సంకోచంలేకుండా దేవుడుగారికి కొంచెము అప్పుడప్పుడు వుపచారం చెయ్యవలసియుంటుంది. పై యోగ్యతలుగల వారంతా దరఖాస్తులు పంపుకొనవచ్చును.

నక్షత్రమండలం ఆఫీసు.

ఈ ఆఫీసులో సూర్యనిస్థానం ఖాళీవచ్చింది. ఎందుచేతంటె యితను యీమధ్య మితిమీరి నడుస్తున్నాడు. కొంపలు అమాంతంగా దయాదాక్షిణ్యములేకుండా తగలబెట్టేస్తున్నాడు. ఇతనిమీద దేవుడుగారికి నమ్మకం బొత్తిగా తగ్గిపోయిందిలెండి. ఇతనిని సర్వీసులోంచి తీసెయ్యడానికి వుత్తరవుచేశాడు. ఈపదవి కావలసినమనిషి చాల జమానుగా యుండాలి. కత్తెరమార్కు- ఏనుగుమార్కు- వాచిమార్కు- మొదలయిన అన్నిరకముల సిగరట్లను- లంకాకు- పొటాకు- స్పెన్సరుమొదలైన సమస్తమైనచుట్టలరకములను, కరం- లక్ష్మి- సింహం- మొదలైన బీడీలను నిత్యము తగలబేస్తూ వీటిని పూర్తిగా నిర్మూలంగావించి- వాటిద్వారావచ్చిన అగ్నిహోత్రంవల్ల మిగిలిన కొంపలను తగులబెట్టగలిగిన వాడై యుండవలెను—

స్వర్గం ఆఫీసు.

ఈ ఆఫీసులో నారదమునిపదవి ప్రస్తుతం ఖాళీ అయివున్నది. ఈయన తనపనిపాపం చాలకాలంబట్టి బాగానె నిర్వహిస్తున్నాడు. కాని యీమధ్య మితిమీరినడవడం మొదలుపెట్టాడు. బ్రహ్మచర్య ఆశ్రమం వదలి గృహస్తాశ్రమంలో ప్రవేసిద్దామనే వూహకలిగింది. అప్సరస్త్రీలంతా భయపడుతున్నారు. అతనిమీద అర్జంటుగా కేసు కల్పించి లోకాంతరవాసశిక్ష వేశారు. రేపోనేడో మెయిలులోవస్తాడు- జాగ్రత్త. ఈవుద్యోగం కావలసినవారు చాల అందవికారంగా యుండాలి. బారెడుగడ్డానికి తక్కువవుండకూడదు. పాతనారదుడులాగ గెడ్డాలుమీసలు గొరిగించుకొని నెత్తిమీద నాలుగు పరకల పిలకవనికిరాదు. అబద్ధాలు-తప్పుడుసాక్ష్యాలు-వున్నవిలేనట్టు- లేనివున్నట్టు చెప్పేవాళ్లకు ప్రాముఖ్యతయివ్వబడును. కొంచెము లంచములు పుచ్చుకోవడం తెలిసుంటే మంచిది.

నిబంధనలు.

(1) ఇక్కడనుంచి వుద్యోగానికి వెళ్లేవాళ్లకి వెళ్లేఖర్చులు యిస్తారు. రిటర్నుటిక్కట్టుయివ్వరు—

(2) అచ్చటనే వలస యేర్పరుచుకొనియుండ వలయును.

(3) డబ్బుసంపాదించుకున్నాక, యీలోకంలో నిబంధువులకు మనియార్డరుచేయ్య వీలులేదు-

(4) సంపాదించినసొమ్ము కుబేరునివద్ద నిల్వచేసుకోవలెను.

ఈపైసంగతులను బాగుగా ఆలోచించుకొని మీమీదరఖాస్తులను యీదిగువచిరునామాకు పంపుకోవలెను.

"పెంటపాడు బైరాగి"
నక్షత్రవీధి.
త్రిశంకస్వర్గపురం పోస్టు,
ఆకాశమండలం.